
సాక్షి నంద్యాల

సోమవారం ၊ 15 ၊ ఏప్రిల్ ၊ 2024



అమ్మవారికి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులను ఉంచి ఆలయ ప్రదక్షిణ చేశారు.



మల్లన్నకు నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆదివారం నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన అర్ధనారీశ్వర కూచిపూడి డ్యాన్స్ అకాడమీ వారి నృత్యప్రదర్శన ఆకట్టుకుంది.



కంగ్రాట్స్.. నిర్మల!

పెద్ద హరివాణం గ్రామానికి చెందిన నిర్మలను కలెక్టర్ డాక్టర్ జి.సృజన ప్రశంసించారు. కేజీబీవీలో చదివి మంచి మార్కులు సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు.

8లో▸

న్యూస్‌రీల్

ఎన్నికల సమాచారానికి సంప్రదించండి

● జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

నంద్యాల: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన సమాచారం కోసం రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నంద్యాల పట్టణంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయం వెనుక భాగంలో 139–నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గం అధికారి కార్యాలయాన్ని ఏర్పాటు చేశామన్నారు.

జలసంరక్షణ ఉద్యమంలో పాల్గొందాం

నంద్యాల(వ్యవసాయం): ఇన్‌టాక్ సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న జలసంరక్షణ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆ సంస్థ నంద్యాల చాప్టర్ కన్వీనర్ శివకుమార్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ జల వనరులను కాపాడాలన్నారు. భావితరాలు నీటి కోసం వలసలు పోయే పరిస్థితి రాకుండా ముందు జాగ్రత్త పడదామన్నారు. ప్రతి ఒక్కరు ఈ మహాయజ్ఞంలో పాలు పంచుకోవాలని ఆయన కోరారు. వివరాల కోసం 9440878658, 7013185604ను సంప్రదించాలన్నారు.

పోలీస్ సేవల కోసం కాల్ చేయండి

● 08514-225097 నెంబర్‌ను సంప్రదించండి

బొమ్మలసత్రం: జిల్లాలో అత్యవసరమైన సమయంలో ప్రజలకు సేవలు అందించేందుకు నూతనంగా ఫోన్ నంబరును ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎక్కడైనా అల్లర్లు, గొడవలు, శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుంటే వెంటనే 08514-225097 నంబరుకు కాల్ చేయాలని కోరారు. ఈ నంబరు 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటుందని, ఎవరైనా కాల్ చేస్తే వెంటనే వారి వద్దకు వచ్చి సమస్యను పరిష్కరిస్తారన్నారు.

రూ.1.10 లక్షల నగదు స్వాధీనం

కోవెలకుంట్ల: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన వాహనాల తనిఖీలో కోవెలకుంట్ల పోలీసులు ఆదివారం రూ. 1.10 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని ముదిగేడు చౌరస్తా వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా మిల్క్‌వ్యానులో ఓ వ్యక్తి వద్ద రూ. లక్షకు పైగా నగదు ఉండటం, అందుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వరప్రసాద్ తెలిపారు.

శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు



క్యూలో బారులుదీరిన భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో కొలువైన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు రోజు కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు అధికసంఖ్యలో శ్రీగిరి చేరుకున్నారు. వేకువజామున్నే పాతాళ గంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మల్లన్న దర్శనానికి బారులుదీరారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా స్వామి అమ్మవార్ల దర్శనం చేసుకున్నారు. భక్తుల రద్దీతో ఆలయ క్యూలైన్లు నిండిపోయాయి. ఆలయ ప్రాంగణం భక్తుల శివనామస్మరణతో మారుమోగింది. క్యూలైన్లలో వేచిఉన్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దేవస్థాన అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులన్నీ కిటకిటలాడాయి.



ఆళ్లగడ్డలో అంబేద్కర్ విగ్రహం దగ్గర కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న రాష్ట్ర జలవనరుల శాఖ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్ తదితరులు



బనగానపల్లెలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

కూటమి కుట్రపై ఆగ్రహజ్వాల

సంక్షేమ సారథి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నాన్ని జిల్లా ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ముక్త కంఠంతో ఖండించారు. విజయవాడ నగరంలో మేమంతా సిద్ధం బస్సుయాత్రలో ఉన్న జగన్‌పై హత్యాయత్నానికి పాల్పడటాన్ని నిరసిస్తూ ఆదివారం జిల్లా వ్యాప్తంగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనలు, కొవ్వొత్తుల ప్రదర్శన, ర్యాలీలు నిర్వహించారు. జననేతకు ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తుండటంతో ఓర్వలేక టీడీపీ, కూటమి నాయకులు పక్కా ప్లాన్ ప్రకారమే హత్యాయత్నానికి పాల్పడ్డారని విమర్శించారు. చంద్రబాబు దిష్టి బొమ్మను దహనం చేశారు. కుట్ర రాజకీయాలకు పాల్పడితే ఓటుతో బాబుకు రాజకీయ సమాధి కడతామని హెచ్చరించారు.

– నంద్యాల

- సీఎం జగన్‌పై హత్యాయత్నాన్ని ఖండించిన జిల్లా ప్రజలు
- ఎన్నికల్లో గెలిచేందుకు పచ్చమూకల అరాచకమంటూ మండిపాటు
- నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపిన ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు
- చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం



నంద్యాల మండలం పుసులూరు గ్రామంలో చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి, రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నానికి నిరసనగా జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు మిన్నంటాయి. నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచారం నల్లబ్యాడ్జీలు ధరించి ప్రచారం చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. నంద్యాల మండలం పుసులూరు గ్రామంలో ఎమ్మెల్యే శిల్పారవి, రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు చంద్రబాబు దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. సీఎంపై హత్యాయత్నానికి పాల్పడిన దుండగలుపై చర్యలు తీసుకోవాలని నంద్యాల గాంధీచౌక్‌లో ఆదివారం రాత్రి ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీసా, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌ల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా మాట్లాడుతూ వైఎస్ జగన్ చేపట్టిన బస్సు యాత్రకు ప్రజల నుంచి వస్తున్న స్పందనను చూసి కూటమి నాయకులు జీర్ణించుకోలేక, ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

శ్రీశైలంలో..

శ్రీశైలం నియోజకవర్గంలోని ఆత్మకూరు పట్టణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దాడికి నిరసగా శ్రీశైలం నియోజకవర్గ నాయకులు శిల్పాభువనేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని శిల్పా భువనేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. బండిఆత్మకూరు, వెలుగోడు, మహానంది మండలాల్లో ప్రజలు సీఎంపై జరిగిన దాడిని ఖండించారు.

ఆళ్లగడ్డలో..

మాజీ ఎమ్మెల్సీ, జల వనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ నాలుగు రోడ్ల కూడలిలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గంగుల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ పథకం ప్రకారమే జగన్‌పై హత్యాయత్నానికి పాల్పడ్డారని, వీరిని వెంటనే శిక్షించాలన్నారు. జగన్ కణతకు గురి చేసి కొట్టారంటే అందులో అనుభవం ఉన్న హంతకులకే సాధ్యమని, దేవుని దయతో సీఎం జగన్ ప్రాణహాని కలుగకుండా బయట పడటం అదృష్టమన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మండల కేంద్రమైన ఉయ్యాలవాడ బస్టాండు ఆవరణలో ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి, నాయకులు, కార్యకర్తలు, నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. మళ్లీ జగనే ముఖ్యమంత్రి అవడం ఖాయంగా భావించిన టీడీపీ అధినేత చంద్రబాబు బహిరంగ సమావేశంలో జగన్‌పై రాళ్లతో దాడి చేయాలని పిలుపునివ్వడంతో ఈ దాడి జరిగిందన్నారు.

బనగానపల్లెలో..

బనగానపల్లెలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నా యకులు, కార్యకర్తలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అంబేద్కర్ జయంతి వేడుకల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ సీఎం జగన్‌పై జరిగిన దాడి ముమ్మాటికి చంద్రబాబు, ఆయన మిత్ర పక్షాల కుట్రేనని పేర్కొన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిల కలిసినప్పటికీ జగన్‌కు ప్రజల్లో ఆదరణ వస్తుండటంతో టీడీపీ నాయకులు ఓర్వలేక ఎన్నికల్లో ఓడిపోతామని కుట్రపన్ని హత్యాయత్నానికి పాల్పడ్డారన్నారు. ఈ సంఘటనపై విచారించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

డోన్‌లో..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నానికి నిరసనగా మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి, మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలోని లక్ష్మీ ఫంక్షన్ హాల్ ఆదివారం జరిగిన సర్వకుల సమ్మేళనంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ ప్రజా ఆదరణ లేక చంద్రబాబు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. బేతంచెర్లలో మంత్రి తనయుడు అర్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు నల్లబ్యాడ్జీలు ధరించి భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. నారా రూప రాక్షసత్వం నశించాలని, ప్రతి పక్ష కూటమి అరాచకాలను అరికట్టాలని, సీఎంపై దాడికి పాల్పడిన నిందితులపై ఎన్నికల కమిషన్ కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు.

నందికొట్కూరులో..

శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, అసెంబ్లీ అభ్యర్థి దారా సుధీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు నందికొట్కూరు పట్టణంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బైరెడ్డి సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబును ప్రజలు నమ్మడం లేదన్నారు. బాబు ఎక్కడ సమావేశం పెట్టినా ప్రజలు రావడం లేదని, జగన్ బస్సు యాత్రకు ప్రజలు తండోపతండాలుగా తరలివస్తుండటంతో టీడీపీ, జనసేన, వారి మిత్రపక్షాల నేతలు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. చంద్రబాబు ఎన్ని హామీలు ఇస్తున్నా ప్రజలు నమ్మకపోవడంతో జగన్‌ను ఏదో విధంగా అంతమొందించేందుకే హత్యాయత్నం చేశారని విమర్శించారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

రుధిర చిత్రం

నంద్యాల అర్బన్: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిపై విజయవాడలో జరిగిన దాడిని నిరసిస్తూ నంద్యాల పట్టణ ప్రముఖ చిత్ర కారుడు చింతలపల్లె కోటేష్ రక్తంతో సీఎం జగన్ చిత్రాన్ని గీశారు. రక్తం చిందినా సడలని సంకల్పంగా ప్రజల అండదండలు జగన్‌కు కొండంతగా ఉన్నట్లు చిత్రంలో వివరించారు. ముందస్తు పన్నాగం, ఓటమి భయంతోనే దాడి జరిగిందని దీనికి జవాబుగా ఆంధ్రరాష్ట్ర ప్రజలు తమ ఓటు ద్వారా తెలియజేస్తారన్నారు. రక్తం చిందించిన నేతకు ప్రజల అండదండలు ఎల్లపుడూ ఉంటాయన్నారు.



అభివృద్ధి, అరాచక శక్తుల మధ్య యుద్ధం



మాట్లాడుతున్న ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



సమావేశానికి హాజరైన ప్రజలు

● మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్: డోన్‌లో జరుగుతున్న ఎన్నికలు అభివృద్ధి, అరాచక శక్తులకు మధ్య యుద్ధంలా మారాయని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని లక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం జరిగిన అన్ని కులాల ఆత్మీయ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనకు మధ్య తేడాను ప్రజలు స్పష్టంగా గ్రహించాలన్నారు. 50 ఏళ్ల రాజకీయ చరిత్ర అని గొప్పలు చెప్పుకుంటున్న కోట్ల, కేఈ కుటుంబాలు ప్రజలకు చేసిందేమిటని నిలదీశారు. గ్రామగ్రామాన ఫ్యాక్షన్ కుంపటి రగిల్చి ప్రజల మధ్యన చిచ్చు రేపి అమాయకులను బలితీసుకున్న వారు అధికార దాహంతో తిరిగి ఏకమై ప్రజల ముందుకు రావడం సిగ్గుచేటన్నారు. నియోజకవర్గంలో 15 ఏళ్ల క్రితం వరకు జరిగిన మారణహోమానికి ఎవరు బాధ్యులని ఆయన కేఈ, కోట్ల వర్గీయులను ప్రశ్నించారు. పలు గ్రామాల్లో భర్త, కొడుకులను ఫ్యాక్షన్‌లో పోగొట్టుకున్న మహిళలను ఎవరిని అడిగినా వారి రక్త చరిత్ర చెబుతారని మండిపడ్డారు.

నియోజకవర్గ రూపు రేఖలు మార్చేశాం..

50 ఏళ్లుగా డోన్ ప్రజల ఓట్ల భిక్షతో గెలిచి కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులుగా పనిచేసిన కేఈ, కోట్ల కుటుంబాలు తమ సొంత గ్రామాలకు సరైన రోడ్లు వేయించుకోలేకపోయారన్నారు. ఈ రోజు కేవలం మూడేళ్ల వ్యవధిలో రూ.3,500 కోట్లతో డోన్ నియోజకవర్గ రూపురేఖలు మార్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కర్నూలు జిల్లాలో ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే టికెట్లు ఆశించి భంగపడటమే కాకుండా చివరకు కర్నూలు ఎంపీ టికెట్ కూడా తెచ్చుకోలేని స్థితిలో కోట్ల, కేఈ వర్గీయులు ఉన్నారన్న విషయం ప్రజలందరికీ తెలిసిందన్నారు.

ఆత్మాభిమానం తాకట్టు..

50 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో తమ ప్రత్యర్థిగా భావించిన కేఈ కుటుంబీకులను వెంట వేసుకొని కోట్ల కుటుంబీకులు ప్రజల ముందుకు రావడం ఆత్మాభిమానం తాకట్టు పెట్టమేనని గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ చిన్నకేశవయ్యగౌడ్ విమర్శించారు. అభివృద్ధిలో డోన్ దేశంలోనే అగ్రగామిగా నిలుస్తుందని మంత్రి తనయుడు బుగ్గన అర్జున్‌రెడ్డి అన్నారు. సమావేశంలో రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఆయా సంఘాల నాయకులు కటిక వేణు, ముస్లిం నాయకులు అక్బర్‌బాషా, మౌళాలి, చిన్నచాందు, పెద్దచాందు, గౌస్, మెకానిక్ సేట్, షేక్షా, వడ్డె సంఘం నాయకులు నాగరాజు, వాల్మీకి సంఘం నాయకులు పెద్దయ్య, మేకలరాజు, బుర్రు శ్రీధర్, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాలుట్ల రఘురాం, బెస్త సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, గౌడ సంఘం నాయకులు ఆర్‌ఈ రాజవర్ధన్, దినేష్ గౌడ్, తిరుమలరెడ్డి పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దాం

● జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌ఓ పద్మజ

నంద్యాల: భారత రత్న, బాబా సాహెబ్ బీఆర్ అంబేడ్కర్ మహనీయుడని, ఆయన ఆశయాలను కొనసాగిద్దామని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అంబేడ్కర్ 133వ జయంతిని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్‌తో పాటు డీఆర్‌ఓ పద్మజ, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి చింతామణి తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాబా సాహెబ్ అంబేడ్కర్ అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కృషి చేశారన్నారు. భారత రాజ్యాంగాన్ని రూపొందించడంతో పాటు కుల నిర్మూలనకు విశేషంగా కృషి చేశారన్నారు. చదువు లేని వారికి కూడా దేశంలో ఓటు హక్కు కల్పించిన ఘనత అంబేడ్కర్‌కే దక్కుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వచ్చే ఎన్నికల్లో వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్నారు.

పెళ్లింట విషాదం



గొల్ల రవి (ఫైల్)

ఆదోని రూరల్: ఆ ఇంట బాజాభజంత్రీలు మోగాయి. కుమారుడి తలపై అక్షింతలు వేసి మురిసిపోయిన తండ్రి గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో పెళ్లింట విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆదోని మండలం బసాపురం గ్రామానికి చెందిన రామదుర్గం గొల్ల రవి(38), రంగమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడైన గోవర్ధన్‌కు తెలంగాణ రాష్ట్రం గద్వాల్ జిల్లా ఐజ మండలం ఇడిగినపల్లె గ్రామానికి చెందిన అక్షితతో ఆదివారం బసాపురం గ్రామంలో పెళ్లి జరిగింది. తలంబ్రాలు అయిన ఓ గంటలోనే వరుడు గోవర్ధన్ తండ్రి రామదుర్గం గొల్ల రవికి ఛాతీలో నొప్పి అంటూ కుప్ప కూలిపోయాడు. వెంటనే బంధువులు ఆయనను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు.

ఫిట్‌గా... ఫర్ఫెక్ట్‌గా

- విద్యా కానుక కిట్ల తయారీకి అధికారుల కసరత్తు
- బడితెరిచే రోజే కిట్లు అందించేలా చర్యలు
- తొమ్మిది రకాల వస్తువులతో కూడిన ప్రత్యేక కిట్లు
- బూట్ల కోసం విద్యార్థుల పాదాల కొలతల సేకరణ

నంద్యాల(న్యూటౌన్): సర్కారు బడుల విద్యార్థుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. 2024–25 విద్యాసంవత్సరానికి పాఠశాల ప్రారంభం రోజునే విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం, బ్యాగ్ అందజేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది. నంద్యాల జిల్లా వ్యాప్తంగా 1,347 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 1 నుంచి 9వ తరగతి చదివే 1,62,348 మంది విద్యార్థులు ఉన్నారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభించిన రోజే అన్ని స్కూళ్లలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వేసవి సెలవుల అనంతరం పాఠశాల పునఃప్రారంభం నాటికి విద్యార్థులకు కిట్ అందజేయాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. ఈ మేరకు విద్యార్థుల వయస్సు, తరగతి ఆధారంగా ఒకే సైజు బూట్లు పంపిణీ చేస్తే అవి కొందరికి సరిపోక వాటిని వేసుకునేందుకు చాలా ఇబ్బంది పడటం జరుగుతుంది. ఇందుకోసం ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 9వ తరగతి చదువుకుంటున్న విద్యార్థుల నుంచి వ్యక్తిగత కొలతలను సేకరిస్తున్నారు. ఇందులో భాగంగా తరగతుల వారీగా విద్యార్థుల పాదాల కొలతలను తీసుకుంటున్నారు.

సిద్ధమవుతున్న పాఠ్య పుస్తకాలు...

జగనన్న విద్యా కానుక కిట్టులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందించనున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా జిల్లాకు దాదాపు 18.54 లక్షల మేర పాఠ్యపుస్తకాలు



విద్యార్థులకు అందించే తొమ్మిది రకాల జగనన్న విద్యాకానుక కిట్టు

అవసరం. వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి బడి తెరిచిన తొలి రోజునే పుస్తకాలను విద్యార్థులు చేతికిచ్చేలా అధికారులు చర్యలు చేపట్టారు. సెమిస్టర్ల వారీగా పుస్తకాలు సరఫరా చేస్తున్నందున మొదటి దఫా ఇవ్వాల్సిన పుస్తకాల ముద్రణ ఇప్పటికే ప్రారంభించినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.



బూట్ల కోసం కొలతలు తీసుకుంటున్న దృశ్యం

వందశాతం సేకరణ పూర్తి...

బూట్లకు సంబంధించి అన్ని పాఠశాలల్లో ప్రతి విద్యార్థి నుంచి కొలతలు తీసుకున్నారు. ఈ విషయంలో పాఠశాలలకు సంబంధించిన హెచ్‌ఎంలతో పాటు ప్రిన్సిపాళ్లు పూర్తి బాధ్యత తీసుకున్నారు. విద్యార్థుల కొలతలు తీసుకుని ఆన్‌లైన్ ద్వారా ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేశారు. జిల్లాలో ఈ ప్రక్రియ వందశాతం పూర్తయింది. కొలతల జాబితాలకు సంబంధించిన హార్డ్ కాపీలను హెచ్‌ఎంలు మండల విద్యాశాఖ అధికారులకు అందజేశారు. వారి ద్వారా జిల్లా శాఖకు అక్కడి నుంచి రాష్ట్ర అధికారులకు డేటాను చేరవేశారు. ఈ డేటా ఆధారంగా విద్యా కానుకలు నేరుగా మండలాల్లోని స్టాక్ పాయింట్లకు రానున్నాయి. అక్కడి నుంచి పాఠశాలలకు చేరవేసి విద్యార్థులకు అందించనున్నారు.

జిల్లాలో 1.62 లక్షల మందికి ప్రయోజనం..

నంద్యాల జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని 1,352 స్కూళ్లలో చదువుతున్న 1,62,276 మంది విద్యార్థులకు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఏటా విద్యాకానుక అందజేస్తున్నారు. దీనికి కొనసాగింపుగా 2024–25 విద్యాసంవత్సరానికి కూడా విద్యాకానుక అందించాలనేది ప్రభుత్వం ముందస్తు నిర్ణయం. ఈ మేరకు విద్యాశాఖ ఉన్నతాధికారులు కానుకలను సిద్ధం చేస్తున్నారు. పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, స్కూల్‌బ్యాగ్ లు, బెల్ట్‌లు, బూట్లు, సాక్స్‌లు, మూడు జతల యూనిఫాంలు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, విద్యాడిక్షనరీతో కలిసి 9రకాల వస్తువులతో కూడిన కిట్టు ఇస్తున్నారు. బయట మార్కెట్లో ఈ కిట్టు విలువ రూ.5వేలు పైనే ఉంటుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేద విద్యార్థుల చదువులకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చింది.

విద్యా కానుక కిట్ల పంపిణీకి కసరత్తు



విద్యా కానుక కిట్లు పంపిణీకి ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించాం. పుస్తకాలు, యూనిఫాం, బ్యాగ్‌లను సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బూట్ల కోసం ప్రతి విద్యార్థి నుంచి పాదాల కొలతలు తీసుకున్నాం. జిల్లాలోని అన్ని స్కూళ్ల నుంచి వివరాలను వచ్చాయి. ఈ నివేదికను రాష్ట్ర అధికారులకు కూడా పంపాం.

– సుధాకర్‌రెడ్డి, డీఈఓ, నంద్యాల

క్లుప్తంగా

చౌడేశ్వరి దేవి ఆలయానికి రూ. 10 లక్షలు విరాళం



రూ. 10లక్షలు విరాళం అందజేస్తున్న పోలిశెట్టి నాగ లక్ష్మయ్య దంపతులు

కల్లూరు: కల్లూరులో వెలసిన శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయ పునర్నిర్మాణానికి కల్లూరుకి చెందిన పోలిశెట్టి నాగ లక్ష్మయ్య, వరలక్ష్మి దంపతులు ఆదివారం ఆలయ కమిటీ సభ్యులకు, కల్లూరు పెద్దలకు రూ.10లక్షలను విరాళంగా అందించారు. ఆలయ చైర్మన్ పోలిశెట్టి వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ శ్రీనివాసులు మాట్లాడుతూ దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు ఆలయాన్ని పునర్నిర్మాణం చేసేందుకు ముందుకు రావడం శుభ పరిణామమన్నారు. ఆలయ పునర్నిర్మాణాకి విరాళం ఇచ్చిన పోలిశెట్టి నాగ లక్ష్మయ్య దంపతులను ఆలయ కమిటీ సభ్యులు, కల్లూరు పెద్దలు పూలమాల వేసి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పోలిశెట్టి కుటుంబ సభ్యులు, చౌడేశ్వరి దేవి ఆలయం భజన మండలి సభ్యులు వెంకటేశ్వర్లు, వరప్రసాదరావు, అక్కె ఈశ్వరయ్య, శివ రామకృష్ణయ్య, గంగాధర్, విశ్వనాథ్, మురళి, రామచంద్రుడు, చౌడయ్య, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రెండు టిప్పర్లు సీజ్

కర్నూలు (న్యూటౌన్): ప్రభుత్వ అనుమతులు (రాయల్టీ) లేకుండా గూడూరులో అక్రమంగా గ్రావెల్‌ను తవ్వి తరలిస్తున్న రెండు టిప్పర్లను సీజ్ చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ తెలిపారు. అక్రమంగా గ్రావెల్‌ను తవ్వి తరలిస్తున్నారనే సమాచారంతో జిల్లా మైనింగ్ డీడీ, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్‌తో కలిసి ఆదివారం ఆకస్మికంగా తనిఖీలు చేశారన్నారు. ఈ తనిఖీల్లో గాలిమరల నిర్మాణానికి అక్రమంగా గ్రావెల్‌ను తవ్వి తరలిస్తుండగా రెండు టిప్పర్లను సీజ్ చేసినట్లు చెప్పారు. సీజ్ చేసిన టిప్పర్లను కోడుమూరు అగ్నిమాపక శాఖ స్టేషన్‌కు తరలించామన్నారు.

17లోగా మరమ్మతులు పూర్తి చేయండి

కర్నూలు కల్చరల్: రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో మరమ్మతులను ఈనెల 17వ తేదీలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలోని గదులకు, మీటింగ్ హాల్‌కు జరుగుతున్న మరమ్మతులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాధారణ ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు ఎన్నికల పరిశీలకులు రానున్నారన్నారు. వీరి కోసం రెండు వీవీపీ గదులు, నాలుగు గదులు సిద్ధం చేయాలని ఆదేశించారు. గదుల్లో అన్ని వసతులు సమకూర్చాలన్నారు. పరిసరాల్లో ఎలాంటి చెత్తా చెదారం ఉండకుండా వాటిని తొలగించి చిప్స్ ఏర్పాటు చేసి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మిగిలిన గదుల మరమ్మతులకు ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. కలెక్టర్ వెంట డీఆర్‌ఓ మధుసూదన్ రావు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ నాగరాజు, ఈఈ సురేష్, డీఈ రవీంద్ర పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ఆదోని రూరల్: కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఇస్వీ ఎస్‌ఐ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. ఆదోని పట్టణం రాజరాజేశ్వరినగర్‌కు చెందిన వీరారెడ్డి కర్ణాటక రాష్ట్రం నుంచి 90 ఎం.ఎల్ పరిమాణం గల 5 బాక్సులను బైకుపై తరలిస్తుండగా పెద్దహరివాణం చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నట్లు వెల్లడించారు. మద్యం, బైక్‌ను స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు.

దుష్ప్రచారం చేస్తే జైలుకే

- పకడ్బందీగా ఎన్నికల నియమావళి అమలుకు చర్యలు
- నకిలీ కథనాల ప్రచురణ..ప్రసారంపై ఎన్నికల సంఘం ప్రత్యేక నిఘా
- ఎన్నికల సమగ్రత దెబ్బతీసే తప్పుడు వార్తల పరిశీలన
- విద్వేష పూరిత ప్రసంగాలు చేస్తే కఠిన చర్యలు
- వివిధ సెక్షన్ల కింద కేసుల నమోదుకు అవకాశం



కర్నూలు(సెంట్రల్): తప్పుడు కథనాలు, వార్తలు, పోస్టింగ్‌లను ఎన్నికల సంఘం సీరియస్‌గా తీసుకుంటుంది. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీసీ) అమలులో భాగంగా ఇప్పటికే ప్రింట్, మీడియా, సోషల్ మీడియాలో ప్రచురితమయ్యే/ప్రసారమయ్యే కథనాలపై ప్రత్యేక నిఘా పెట్టింది. ప్రచురించిన సందేశం లేదా అంశాన్ని బట్టి బాధ్యులకు నోటీసులు జారీ చేసి కేసులు నమోదు చేయనుంది.

హద్దు మీరితే జైలుకే...

ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలకు ఎన్నికల సంఘం సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పకడ్బందీగా ఎన్నికల కోడ్ అమలుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మీడియా, సోషల్ మీడియాలో వచ్చే కథనాలు, స్క్రోలింగులు, బల్కు ఎస్‌ఎంఎస్‌లు, ఇతర అంశాలను నిశితంగా గమనిస్తున్నారు. ఎల్రక్టానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం), లా అండ్ ఆర్డర్, ఎన్నికల సమగ్రత, ఎన్నికల ప్రణాళిక/నిర్వహణ తదితర అంశాలపై నకిలీ కథనాల ప్రచురణ/ప్రసారం చేసిన ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందే వస్తుంది. అలాగే ద్వేషపూరిత ప్రసంగాలు, తప్పుడు సమాచారం, నకిలీ వార్తలు సోషల్ మీడియాలో ప్రసారమైతే వాటిని చట్ట వ్యతిరేక సందేశాలుగా గుర్తించి సంబంధిత పోస్టులు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. అయితే, ఎలాంటి పోస్టులకు ఎలాంటి సెక్షన్‌లు వర్తిస్తాయి? వాటికి పడే శిక్షలు తదితర వివరాలు...

ఐపీసీ సెక్షన్ 505 : ఈ సెక్షన్ కింద ప్రజా దుష్ప్రచారానికి దారితీసే ప్రకటలు, సందేశాలు, ఎవరైనా ఇతర తరగతి లేదా కమ్యూనిటీకి వ్యతిరేకంగా ఏదైనా నేరానికి పాల్పడేటటువంటి ఇతర వర్గాన్ని లేదా సంఘాన్ని ప్రేరేపించే ఉద్దేశంతో..ఏదైనా ప్రకటన లేదా నివేదికను చూసి ప్రచురించినా లేదా ప్రసారం చేసినా వారికి జైలు శిక్ష విధించబడుతుంది. ఈ శిక్ష మూడు సంవత్సరాల వరకు ఉండొచ్చు. లేదా జరిమానా లేదా రెండింటినీ అమలు చేయవచ్చు.

ఆర్‌పీ చట్టం 1951 సెక్షన్ 125 : ఎన్నికలకు సంబంధించి వివధ వర్గాల మధ్య శత్రుత్వాన్ని ప్రోత్సహించడం జరిగితే ఈ చట్టం కింద శిక్ష విధిస్తారు

ఐపీసీ సెక్షన్ 153ఏ : మతం, జాతి, జన్మస్థలం, నివాసం, భాష మొదలైన వాటి ఆధారంగా వివిధ సమూహాల మధ్య శత్రుత్వాన్ని పెంపొందించడం, సామరస్య పరిరక్షణకు హాని కలిగించే చర్యలపై కథనాలు ప్రచురించినా...ప్రసారం చేసినా శిక్షకు అర్హులే..

ఐపీసీ సెక్షన్ 153బీ : జాతీయ సమగ్రతకు విఘాతం కలిగించే ఆరోపణలు, వాదనలపై కథనాలు/ప్రసారం నేరం.

ఐపీసీ సెక్షన్ 295ఏ : ఉద్దేశపూర్వక, హానికర చర్యలు. ఒక తరగతి లేదా మతం వారు...వేరొక మతం లేదా మత విశ్వాసాలను అవమానించడం ద్వారా వారి మతపరమైన భావాలను ఆగ్రహానికి గురిచేయడానికి ఉద్దేశించిన కథనాలు శిక్షకు అర్హులను చేస్తాయి.

ఐపీసీ సెక్షన్ 298 : ఈ చట్టం ప్రకారం..మతపరమైన భావాలను గాయపరిచే ఉద్దేశంతో కథనాలు రాస్తే మూడేళ్ల వరకు శిక్ష పడే అవకాశం.

ఆర్‌పీ చట్టం 1951 సెక్షన్ 123(3ఏ) : మతం,జాతి, కులం, కమ్యూనిటీ లేదా భాషప్రతిపాదికన అభ్యర్థి లేదా అతని ఏజెంట్ లేదా మరే ఇతర వ్యక్తి ద్వార దేశంలోని వివిధ తరగతుల పౌరుల మధ్య శత్రుత్వం లేదా ద్వేష భావాలను ప్రోత్సహించడం లేదా ప్రయత్నించడం నేరమే. ఒక అభ్యర్థి లేదా అతని ఎన్నికల ఏజెంట్ సమ్మతి ఆ అభ్యర్థి ఎన్నికల అవకాశాలను మెరుగుపరచడానికి లేదా ఏదైనా అభ్యర్థి ఎన్నికను పక్షపాతంగా ప్రభావితం చేయడానికి సంబంధించిన కథనాలు కూడా ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకే వస్తాయి.

ఆర్‌పీ చట్టంలోని సెక్షన్ 94 : ఓటింగ్ గోప్యత ఉల్లంఘన కోడ్ అతిక్రమణ కిందకు వస్తాయి.

ఐపీసీ సెక్షన్ 171 సీ : ఎన్నికల్లో మితిమీరిన ప్రభావం ఎవరైనా స్వచ్ఛందంగా జోక్యం చేసుకున్నా లేదా ఏదైనా ఎన్నికల హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవడంలో జోక్యం చేసుకునేందుకు ప్రయత్నించినా, ఎన్నికల్లో అనవసర ప్రభావానికి లోనైనా ఉల్లంఘన కిందకే వస్తుంది. బాధ్యులకు మూడేళ్ల వరకు శిక్ష పడే అవకాశం ఉంటుంది.

ఐపీసీ సెక్షన్ 171జీ : ఎన్నికలకు సంబంధించి తప్పుడు ప్రకటన అనేది ఎన్నికల ఫలితాన్ని ప్రభావితం చేయాలనే ఉద్దేశంతో..అది అబద్ధమని నమ్ముతున్న విషయాన్ని వాస్తవ రూపంగా ఎవరూ ప్రచురించినా చట్టవ్యతిరేక చర్యగా పరిగణించి శిక్ష విధిస్తారు.

ఆర్‌పీ చట్టం 1951 సెక్షన్ 126(1)(బీ) : సైలెన్స్ పీరియడ్‌లో ఒపీనియన్ పోల్స్ నిషేధం.

ఆర్‌పీ చట్టం 1951 126(ఏ): నిర్దిష్ట వ్యవధిలో ఎగ్జిట్ పోల్ నిర్వహించడం, వాటి ఫలితాలను ప్రచారం చేయడాన్ని ఆర్‌పీ చట్టం 1951 126(ఏ) నిషేధిస్తుంది.

ఐపీసీ సెక్షన్ 471: నకిలీ డాక్యుమెంట్ లేదా ఎల్రక్టానిక్ రికార్డును నమ్మదగినదిగా లేదా నిజమైనదిగా ప్రచారం లేదా ప్రసారం చేస్తే సంబంధిత వ్యక్తి లేదా సంస్థలు శిక్షింపబడతాయి.

జిల్లాలో మీడియా, సోషల్ మీడియాపై పర్యవేక్షణ

జిల్లాలో కర్నూలు పార్లమెంట్‌తోపాటు 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు మే 13వ తేదీన పోలింగ్ జరుగనున్నది. ఈ క్రమంలో ఫేక్ న్యూస్‌ను నివారించేందుకు జిల్లా ఎన్నికల అధికారి/కలెక్టర్ నేతృత్వంలో మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ) పనిచేస్తోంది. ఈ కమిటీ నేతృత్వంలో ఫేక్ న్యూస్ నియంత్రణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు. అభ్యర్థులు తమకు ఓటు వేయాలని కోరుతూ సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్, ఇతర ఖాతాల ద్వారా చేసుకునే ప్రచారంపై దృష్టి సారించింది. అలాగే ఎల్రక్టానిక్ మీడియాలో వచ్చే అడ్వర్‌టైజ్‌మెంట్, స్క్రోలింగ్ రూపంలో వచ్చే వార్తలు, రేడియో, సినిమా హాళ్లలో ప్రచారం, ఈ పేపర్లు, ప్రచార రథాలు, కేబుల్ టీవీల్లో స్క్రోలింగ్‌పై నిశిత పరిశీలన చేస్తోంది. ఎంసీఎంసీ అనుమతి లేని అభ్యర్థులు లేదా రాజకీయ పార్టీల ప్రచారాలను నిలుపుదల చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే జిల్లాలో దాదాపు మీడియా, సోషల్ మీడియాల ద్వారా ప్రచారం చేసుకునే అభ్యర్థులకు నోటీసులు ఇవ్వాలని అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు 110 సార్లు ఫిర్యాదు చేసింది.

మల్లన్న సన్నిధిలో సీఎం కార్యాలయ ప్రిన్సిపల్ సెక్రటరీ



మల్లన్న దర్శనానికి వెళ్తున్న ఐఏఎస్ అధికారి ముత్యాలరాజు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను ముఖ్యమంత్రి కార్యాలయ ప్రిన్సిపల్ సెక్రెటరీ ముత్యాలరాజు (ఐఏఎస్) దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆదివారం ఉదయం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన ఐఏఎస్ అధికారికి ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు, అర్చకస్వాములు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆలయం వద్దగల ఆశీర్వచన మండపంలో ఐఏఎస్ అధికారికి వేదపండితులు వేద మంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. ఈఓ స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూ ప్రసాదాలను అందించి సత్కరించారు. వీరి వెంట దేవస్థాన ఏఈవోలు మోహన్, హరిదాసు ఉన్నారు.

చెక్‌పోస్ట్‌ల వద్ద క్షుణ్ణంగా తనిఖీలు



ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: జిల్లాలోని అన్ని పోలీస్ చెక్‌పోస్ట్‌ల వద్ద సిబ్బంది వాహనాల తనిఖీలను క్షుణ్ణంగా నిర్వహిస్తున్నారని జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరు నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు. నగదు, మద్యం పంపిణీలను అడ్డుకునేందుకు చెక్‌పోస్ట్‌ల వద్ద గట్టి నిఘా పెంచామన్నారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి మన జిల్లాలోకి ప్రవేశించే వాహనాలపై దృష్టి సారించామన్నారు. ఇప్పటి వరకు ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన 41 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. జిల్లాలో ఉన్న రెండు అంతరాష్ట్ర, 8 అంతర్ జిల్లా చెక్ పోస్ట్‌ల వద్ద సరైన పత్రాలు లేని రూ. 3.28 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నామని వివరించారు. జిల్లాలో అల్లర్లు సృష్టించే 2,489 మందిని గుర్తించి బైండోవర్ చేశామని పేర్కొన్నారు. నాటుసారా తరలింపు, తయారీ, విక్రయదారులపై ఇప్పటి వరకూ 142 కేసులు నమోదు చేయగా 6,364 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకోవటం జరిగిందన్నారు. మద్యం, గంజాయి తరలిస్తున్న 25 మందిపై కేసులు నమోదు చేశామని వివరించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

మహానందిలో సండే సందడి



మహానందీశ్వరుడి దర్శనార్థం వేచివున్న భక్తులు

మహానంది: మహానంది పుణ్యక్షేత్రంలో ఆదివారం సెలవురోజు కావడంతో భక్తుల సందడి నెలకొంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. భక్తులు స్థానిక రుద్రగుండం, బ్రహ్మగుండం, విష్ణుగుండం కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఇదిలా ఉండగా దేవస్థానానికి చెందిన వసతిగృహాలు నిండిపోవడంతో భక్తులు ప్రైవేటు లాడ్జీల వైపు వెళ్లాల్సి వచ్చింది. సందట్లో సడేమియా అన్న చందంగా ప్రైవేటు లాడ్జీల యజమాన్యాలు అధిక మొత్తంలో వసూలు చేస్తున్నట్లు భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సాధారణ రోజుల్లో ధరల కంటే రెండు, మూడు రెట్లు అధికంగా వసూలు చేయడం గమనార్హం.

కంగ్రాట్స్.. నిర్మల!

- ఆడపిల్లలకు రోల్ మోడల్
- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన



బైపీసీలో 421 మార్కులు సాధించిన నిర్మలతో జిల్లా కలెక్టర్ సృజన, ఇతర అధికారులు

కర్నూలు కల్చరల్/ఆదోని రూరల్: నిర్మల పోరాట యోధురాలని, ఆ అమ్మాయి దృఢ సంకల్పం, పోరాట పటిమకు సెల్యూట్ అని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ప్రశంసించారు. ఆదోని మండలం పెద్ద హరివాణం గ్రామానికి చెందిన నిర్మల 10వ తరతగతిలో మంచి మార్కులు సాధించినప్పటికీ పేదరికంతో తల్లిదండ్రులు చదువు మాన్పించిన సందర్భంలో కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నిర్మలను ఆస్పరి కేజీబీవీలో చేర్పించారు. ఆ విద్యార్థిని ఇంటర్మీడియట్ బైపీసీ గ్రూప్‌తో మొదటి సంవత్సరం పరీక్షల్లో 440 మార్కులకు 421 మార్కులు సాధించి జిల్లాలో టాపర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా కలెక్టర్ ఆదివారం నిర్మలను క్యాంప్ కార్యాలయానికి పిలిపించుకొని అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో బైపీసీ గ్రూప్‌లు ఉన్న 8 కేజీబీవీల్లో నిర్మల టాపర్‌గా నిలవడం అభినందనీయమన్నారు. ఆదోని మండలం పెద్ద హరివాణం గ్రామానికి చెందిన హనుమంతమ్మ, శ్రీనివాస్ దంపతుల కుమార్తె నిర్మల గురించి నేడు రాష్ట్ర వ్యాప్తంగా చర్చించుకుంటున్నారన్నారు. ఆడపిల్లలకు నిర్మల రోల్‌మోడల్, స్ఫూర్తి ప్రదాత అని ప్రశంసించారు. ఎన్ని ప్రతిఘటనలు ఎదురైనప్పటికీ దృఢ సంకల్పంతో చదువుకోవాలన్న తన కోరికను నెరవేర్చుకొని ఉన్నత ఆశయంతో ముందుకు వెళుతోందన్నారు. విద్యతోనే సాధికారత లభిస్తుందని ఆడపిల్లలు చదువుకొని సామాజికంగా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. బేటీ బచావో బేటీ పడావో కింద నిర్మలకు ఇన్సెంటివ్ ఇవ్వాలని ఇంచార్జ్ ఐసీడీఎస్ పీడీని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థిని ఖాతాలో ఇన్సెంటివ్ జమ చేయడం వల్ల ఇంటర్ తరువాత వారి తల్లిదండ్రులకు ఆర్థిక భారం లేకుండా పైచదువులు చదువుకోడానికి ఉపయోగ పడుతుందన్నారు. సమస్యలతో చదువుకోలేక మధ్యలో చదువు ఆపేసిన వారు ఇంకా ఎవరైనా ఉంటే స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించి అలాంటి వారిని ఈ సంవత్సరం కేజీబీవీల్లో అడ్మిషన్ చేయించాలని ఆదేశించారు. నిర్మల సాధించిన ప్రగతి గురించి అందరికి తెలిసేలా సమావేశం నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ నిర్మలను శాలువాతో సన్మానించి స్వీట్స్ అందజేశారు. ఇదే స్ఫూర్తితో ఉన్నత చదువులు చదివి జీవితంలో అనేక విజయాలు సాధించాలని సూచించారు.

కలెక్టర్ చేసిన మేలు జీవితంలో మర్చిపోలేను..

గ్రామంలో ఉన్న జడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి చదివి 537 మార్కులు సాధించానని, తల్లిదండ్రుల ఆర్థిక సమస్యలతో చదువు వద్దని పెళ్లి చేయాలని నిర్ణయించుకున్నారని అయితే తనకు ఉన్నత చదువులు చదవాలనే కోరిక ఉండడంతో అధికారుల దృష్టికి తీసుకెళ్లానని నిర్మల తెలిపారు. ఈ విషయం ప్రతికల్లో ప్రచురితమై కలెక్టర్ దృష్టికి వెళ్లడం, కలెక్టర్ మేడం వెంటనే స్పందించి కేజీబీవీలో అడ్మిషన్ ఇప్పించారన్నారు. ఈరోజు ఇంటర్ బైపీసీ మొదటి సంవత్సరం పరీక్షల్లో కేజీబీవీల్లో టాపర్‌గా నిలవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్, సమగ్ర శిక్ష ఏపీసీ విజయ జ్యోతి, ఇన్‌ఛార్జి ఐసీడీఎస్ పీడీ వెంకట లక్ష్మమ్మ, జీసీడీవో సునీత, కేజీబీవీ ఎస్‌ఓ శరన్‌స్మైలీ, ఆదోని ఎంఈఓ-2 శ్రీనివాసులు, విద్యార్థిని తల్లిదండ్రులు, బంధువులు పాల్గొన్నారు.

అన్నదమ్ముల మధ్య ఘర్షణ

డోన్ టౌన్: ఇందిరాంపల్లె గ్రామంలో నీటిని పట్టుకునే సమయంలో అన్నదమ్ములు ఘర్షణ పడ్డారు. రూరల్ ఎస్ఐ సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన అన్నదమ్ములు మల్లికార్జున, శ్రీనివాసులు పక్కనే నివాసముంటున్నారు. ఆదివారం కుళాయి నీటిని పట్టుకునే సమయంలో నీళ్లు మీద పడ్డాయి అంటూ తమ్ముడు శ్రీనివాసులు, అతని భార్య వెంకటలక్ష్మి .. మల్లికార్జున అతని భార్య దాసమ్మ దంపతులపై దాడి చేశారన్నారు. మల్లికార్జున దంపతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ ప్రసాద్, ఎస్ఐ

కోసిగి: ఎన్నికల నేపథ్యంలో ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ప్రసాద్, ఎస్ఐ సతీష్ కుమార్ హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ.. గత ఎన్నికల సమయంలో ఘర్షణ పడిన వారు నేటికీ రౌడీషీటర్లుగా ఉండిపోవాల్సి వచ్చిందన్నారు. ప్రజల ఓటు హక్కును భంగం కలిగించకుండా ఎవరి ఓటు వారు వేసుకునేలా స్వేచ్ఛ కల్పించాలన్నారు. ఎన్నికల వేళ గొడవలు పడడం వల్ల జీవితాంతం కుటుంబాలకు దూరం కావాల్సి వస్తుందన్నారు. పాతకక్షలు మాని కుటుంబంతో సుఖసంతోషాలతో జీవించాలని సూచించారు. ఎవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎన్నికల్లో గొడవలకు దూరంగా ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రౌడీషీటర్ల నుంచి పేర్లు తొలగించే ప్రయత్నం చేస్తామని సీఐ తెలిపారు.

అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ

- ఈ నెల 20వరకు అగ్నిమాపక వారోత్సవాలు
- గత ఏడాది రూ.57.61 కోట్ల మేర ఆస్తిని కాపాడిన అగ్నిమాపక సిబ్బంది



అగ్నిమాపక వారోత్సవాల ప్రారంభం సందర్భంగా కరపత్రంన ఆవిష్కరిస్తున్న ఆ శాఖ అధికారులు

కర్నూలు : వేసవిలో అగ్ని ప్రమాదాలు సంభవించే ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. కర్నూలు జిల్లాలో తరచూ అగ్ని ప్రమాదాలు సంభవిస్తూ ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లుతుంది. దీనికి ప్రధాన కారణం ప్రజల్లో అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన లేకపోవడమే. ప్రధానంగా వేసవిలో మండే స్వభావం కలిగిన వస్తువులను జాగ్రత్తగా ఉంచడం, మంటలను ఆర్పే యంత్రాలను సిద్ధంగా ఉంచుకోవడంతో పాటు పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి ఏటా ఏప్రిల్ 14 నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలను ఆ శాఖ నిర్వహిస్తోంది.

గతేడాది 12 మందిని కాపాడిన సిబ్బంది...

కర్నూలు జిల్లాలో ఆరు అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి.. గత ఏడాది 12 మందిని సిబ్బంది కాపాడారు. 2023 జనవరి 1 నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు కర్నూలు జిల్లాలో మొత్తం 231ప్రమాదాలు జరిగాయి. వీటిలో తీవ్ర ప్రమాదాలు రెండు ఉన్నాయి. మధ్య తరహా ప్రమాదాలు జిల్లాలో 21, చిన్న ప్రమాదాలు 194 జరిగాయి. ప్రమాదాల్లో చిక్కుకున్న 12 మందిని అగ్నిమాపక సిబ్బంది కాపాడారు. రెస్క్యూ కాల్స్ 14 రాగా 8 మంది ప్రాణాలను సిబ్బంది కాపాడగా ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. అగ్ని ప్రమాదాలతో మొత్తం రూ.25.83 కోట్ల ఆస్తినష్టం సంభవించింది. మొత్తం రూ.57.61 కోట్ల మేర ఆస్తిని అగ్ని మాపక సిబ్బంది కాపాడగలిగారు.

వారోత్సవాల్లో ఇవీ కార్యక్రమాలు...

విధుల్లో ప్రాణాలు కోల్పోయి అమరవీరులైన సిబ్బందికి ఆదివారం వారోత్సవాలు ప్రారంభం సందర్భంగా కర్నూలు అగ్నిమాపక కేంద్రంలో నివాళులర్పించారు. ప్రాంతీయ అగ్నిమాపక అధికారి ఎం భూపాల్‌రెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి అవినాష్ జయసింహా, జిల్లా అగ్నిమాపక సహాయ అధికారి బజారి తదితరులు ఈ కార్యక్రమానికి హాజరై నివాళులు అర్పించిన అనంతరం అగ్నిప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించే కరపత్రాలను ఆవిష్కరించారు.

15వ తేదీ చెక్‌పోస్టు, కొండారెడ్డి బురుజు, రాజ్‌విహార్ సర్కిల్, ఆర్‌ఎస్ రోడ్డు సర్కిల్ ప్రాంతాల్లో సదస్సుల నిర్వహించనున్నారు.

16వ తేదీ శిల్పానందనవనం – ఎల్కూరు ఎస్టేట్‌తో పాటు కాలనీలు, అపార్ట్‌మెంట్‌లలో గ్యాస్ వాడకంపై అవగాహన కల్పిస్తారు.

17వ తేదీ విద్యా సంస్థల్లో మంటలను ఆర్పడంపై నమూనాల ప్రదర్శన ఉంటుంది.

18వ తేదీ పారిశ్రామిక వాడలు, పెట్రోల్ బంకుల్లో మంటలను ఆర్పడంపై ప్రదర్శన నిర్వహిస్తారు.

19వ తేదీ అగ్ని ప్రమాదాల్లో గాయపడిన వారికి చికిత్స అందించడంపై శిక్షణ ఇస్తారు.

20వ తేదీ అగ్ని ప్రమాదాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు రాత, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తారు. కర్నూలు అగ్నిమాపక కేంద్రంలో వర్క్‌షాప్ నిర్వహించి సెమినార్ విజేతలకు బహుమతులు అందజేస్తారు.

జిల్లాలో అగ్నిమాపక కేంద్రాలు..

ఫైర్ స్టేషన్	ఫోన్ నంబర్
కర్నూలు	08518- 255101
కోడుమూరు	08525 - 228188
ఎమ్మిగనూరు	08512 - 255101
ఆదోని	08512 - 252299
పత్తికొండ	08520- 226700
ఆలూరు	08523- 229088

నష్టనివారణే ధ్యేయంగా...



అధికంగా సంభవించే అగ్ని ప్రమాదాల్లో ప్రాణ, ఆస్తి నష్టాల నివారణే ధ్యేయంగా ఏటా అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నాం. ఆసుపత్రులు, అపార్ట్‌మెంట్లు, విద్యా సంస్థలు, షాపింగ్ మాల్స్, పరిశ్రమల్లో అగ్నిమాపక నివారణ చర్యలను పకడ్బందీగా పాటించాలి. పాటించని వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయి.

– అవినాష్‌జయసింహా, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి